# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించేందుకు భారత్ మద్దతు కొనసాగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు.
2. హైదరాబాద్ ఓఆర్ఆర్ రెండో దశలో భాగంగా తాగునీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టును తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు.
3. ఆంధ్రప్రదేశ్‌లో యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని యువజన, క్రీడా శాఖమంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
4. పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానమని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.
5. బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా జరిగిన ఆసియా కప్ హాకీ టోర్నీ ఫైనల్‌లో భారత్.. దక్షిణ కొరియాపై విజయం సాధించింది.

===========================

ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించేందుకు భారత్ మద్దతు కొనసాగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఫ్రాన్స్ దేశ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ప్రధానమంత్రి నిన్న టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా ఆర్థిక, రక్షణ, సైన్స్, టెక్నాలజీ, అంతరిక్షం సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గురించి ఇరువురు చర్చించారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలను ప్రోత్సహించడం కోసం సంప్రదింపులను కొనసాగించడానికి, పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకారం తెలిపాయి.

-----------------------------

హైదరాబాద్ బాహ్య వలయ రహదారి- ఓఆర్ఆర్ రెండో దశలో భాగంగా ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టును తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు లాంఛనంగా ప్రారంభిస్తారు. 1200 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. అలాగే హైదరాబాద్ కు తాగునీరు, మూసీకి పునరుజ్జీవం కల్పించే లక్ష్యంతో చేపట్టనున్న గోదావరి తాగునీటి పథకం రెండు,మూడో దశకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని యువజన, క్రీడా

శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన మాట్లాడుతూ, ఉద్యోగాల సాధనకు అవసరమైన శిక్షణ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్... 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మాతాశిశు వైద్యాన్ని మరింత మెరుగ్గా అందించడానికి ఆయా విభాగాలకు కొత్తగా వెయ్యి పడకలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కొత్తగా గుంటూరు, కాకినాడ ప్రభుత్వాసుపతులలో రెండు నూతన తల్లి, పిల్లల సంరక్షణ విభాగాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో విభాగంలో 500 చొప్పున పడకలు వస్తాయని ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందుకు అవసరమయ్యే వైద్య పరికరాల్ని 5 కోట్ల 13 లక్షల రూపాయలతో కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ఆమోదం తెలిపామని మంత్రి వివరించారు.

---------------------------

పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానమని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తమిళనాడు కోయంబత్తూర్‌లోని పారిశ్రామికవేత్తలతో మంత్రి గత సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందన్నారు. పరిశ్రమలకు ఏకగవాక్ష అనుమతులతో పాటు పెట్టుబడిదారుల అనుకూల విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వాయు, జల, రోడ్డు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని లోకేష్ వెల్లడించారు.

---------------------------

వస్తు సేవల పన్ను-జీఎస్టీ స్లాబ్‌లను సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తూ కేంద్రం జీఎస్టీని తగ్గించింది. వ్యవసాయ పనిముట్లపై విధించే జీఎస్టీని తగ్గించడంతో పశుపోషకులపై ఆర్థిక భారం తగ్గుతుందని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు తెలుపుతూ,

వాయిస్.. 30 సెకన్లు

కాగా కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ సంస్కరణలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని జామి మండల పరిధిలోని అలమండ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద కారు డ్రైవర్ అతి వేగంతో మూడు ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారని తెలిపారు.

---------------------------

తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆయిల్ పామ్ కర్మాగారాన్ని మంత్రి నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

వాయిస్ ..18 సెకన్లు

---------------------------

చంద్రగ్రహణం ముగియడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మూసివేసిన ఆలయాలు తిరిగి తెరుచుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని ఈ తెల్లవారు జామున 3 గంటల తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులను దర్శనానికి టిటిడి అనుమతించింది. అలాగే విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం, శ్రీశైలం, భద్రాచలం, యాదగిరిగుట్ట వంటి ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు.

---------------------------

బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా నిన్న జరిగిన ఆసియా కప్ హాకీ టోర్నీ ఫైనల్‌లో భారత హాకీ జట్టు 4-1 తేడాతో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. భారత్ తరపున దిల్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ కొట్టగా.. సుఖ్‌జీత్, అమిత్ రొహిదాస్ చెరో గోల్ సాధించారు. భారత్‌కు ఇది నాలుగో ఆసియాకప్ టైటిల్. ఇంతకుముందు 2003, 2007, 2017లో ఈ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది.

కాగా.. భారత హాకీ జట్టుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిషా, ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..26 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడు రోజులపాటు పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================